డిప్యూటీ సీఎంకు ఆహ్వానం



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఈ నెల 20న జరిగే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. బేగంపేటలోని ఆయన నివాసంలో మంగళవారం కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రాన్ని అందజేసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్, కన్వీనర్ జి.అరవింద్ గౌడ్, మాజీ చైర్మన్ కె.వెంకటేష్, కోశాధికారి ఎ.చంద్రకుమార్, సాంస్కృతిక కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్జిమండీలో ఘనంగా ఘటం ఊరేగింపు



గోల్కొండ: కార్వాన్ సబ్జిమండీలోని నల్లపోచమ్మ, మహంకాళి అమ్మవార్ల ఘటం ఊరేగింపు మంగళవారం ఘనంగా జరిగింది. ఉమ్మడి బోనాల పూజా కమిటీ అధ్యక్షుడు దొర్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పూజా కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, డి.గోపాల్, చంద్రశేఖర్, జి.శివరత్నం, వేణు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దర్బార్ మైసమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



గోల్కొండ: కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ అమ్మవారు మహా శక్తిమంతురాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మిత్రకృష్ణ అన్నారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర సేవా సమితి వారు మంగళవారం దర్బార్ మైసమ్మకు పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్, ప్రధాన సలహాదారులు బొమ్మల సాయిబాబాచారి తదితరులున్నారు.

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక



సుల్తాన్‌బజార్: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని అన్నారు. టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ క్యాంపస్‌లోని రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయంలో బోనాల పండుగ ఉత్సాహంగా జరిగింది. అమ్మవారికి మహిళా ఉద్యోగులు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముజీబ్ హుస్సేని, టీఎన్జీఓస్ నాయకులు శ్రీకాంత్, రాజ్‌కుమార్‌తో పాటు ఆలయ చైర్మన్ మామిడి ప్రభాకర్, సలహాదారులు దేవదాస్, వి.ప్రభాకర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి హరి, వైస్ చైర్మన్‌లు వి.చంద్రశేఖర్, ఆకుల క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



యాకుత్‌పురా: హరిబౌలీలోని గజనన వ్యాయామశాల మాతేశ్వరీ పోచమ్మ, మహంకాళి ఆలయంలో మంగళవారం ప్రభునాథ్, జయశ్రీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీలలితా సహస్ర నామ సహిత కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవాలు, కుంకుమార్చన, 108, 1008 నామాల ఆరాదన ప్రత్యేకతను అర్చకులు వివరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కెడాల దినేష్, శ్రావణ్, గోపాల్‌యాదవ్, అజయ్, శ్రీధర్, రవీందర్, ప్రభునాథ్, ప్రకాష్, విఠల్‌రావు, సాయితేజ, శ్రీనివాస్, అభినవ్, వేద్‌సాయి, అర్చకులు రంగనాథ్ పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు



గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రేణుకాఎల్లమ్మ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా శాకంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఇప్పటికే రూపొందించిన కార్యాచరణ

- 24/7 అందుబాటులో విద్యుత్ సిబ్బంది
- లోడ్ పెరిగిపోవడంతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో టీజీఎస్పీడీసీఎల్ చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్



మల్లాది శ్రీధర్, డీఈ, చార్మినార్

చార్మినార్: బోనాలు ఉత్సవాలను పురస్కరించుకొని పాతబస్తీలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని టీజీఎస్పీడీసీఎల్ చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్ అన్నారు. ఇప్పటికే అవసరమైన అన్ని ప్రధాన ఆలయాలతో పాటు వీధుల్లో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. ఈసారి జరిగే బోనాల ఉత్సవాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు.

పాతబస్తీలో బోనాల జాతరపై ఎలాంటి కార్యాచరణ రూపొందించారు?

వారం రోజులుగా తమ పరిధిలోని చార్మినార్, ఫలక్‌నుమా, మీరాలం సబ్ డివిజన్ల పరిధిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. అధిక వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం.

ఎక్కడెక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి ఉంచారు?

లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయం, అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం వద్ద అందుబాటులో ఉంచాం.

వీటి కెపాసిటీ ఎంత?

500 కే తో పాటు 315 కేవీ, 160 కేవీ కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచాం.

విద్యుత్ వైర్ల సమస్యలు లేకుండా తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

సామూహిక ఊరేగింపు సందర్భంగా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పాతవాటిని తొలగించి ఎయిర్ బెంచ్ కేబుల్‌లను ఏర్పాటు చేస్తున్నాం.

ఎక్కడెక్కడ?

మీరాలంమండి, లాల్‌దర్వాజా, హరిబౌలి, బేలా, ఉప్పుగూడా తదితర ప్రాంతాల్లో ఏబీ కేబుల్‌లను ఏర్పాటు చేస్తున్నాం.

బోనాల పండుగ జరిగే వారం రోజుల్లో విద్యుత్ లోడ్ అధికంగా ఉంటున్నందున తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయం వద్ద గతంలో సప్లయ్ ఉన్న ఛత్రినాక పోలీస్ క్వార్టర్స్ విద్యుత్ ఫీడర్స్ నుంచి కొత్తగా కిల్వత్ విద్యుత్ ఫీడర్‌కు అనుసంధానం చేశాం.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే ఎవరిని సంప్రదించాలి?

హైదరాబాద్ సౌత్ సర్కిల్ కంట్రోల్ రూమ్-8712470596,
చార్మినార్ ఎఫ్ఓసీ 8712470805,
చార్మినార్ ఏఈ-8712470720,
చార్మినార్ ఏడీఈ-8712470716,
చార్మినార్-సీబీడీ ఏడీఈ-87124 70719.

పాతబస్తీలోని మీ పరిధిలో అధికారికంగా ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి?

చార్మినార్ సబ్ డివిజన్ పరిధిలో 76,200, ఫలక్‌నుమా పరిధిలో 1,12,300, మీరాలం సబ్ డివిజన్ పరిధిలో 1,29,600 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

ఘనంగా సూర్యనారాయణ స్వామికి పూజలు



సూర్య నమస్కారం పూజల్లో పాల్గొన్న భక్తులు

చార్మినార్: బోనాల ఉత్సవాల్లో భాగంగా మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మంగళవారం సూర్య నమస్కార పూజలు వైభవంగా నిర్వహించారు. మహా నైవేద్యం, పంచ హారతి, సామూహిక హారతి, మంత్రపుష్పం పూజా కార్యక్రమాలతో పాటు సామూహిక సహస్రనామ కుంకుమార్చన, సామూహిక హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ పూజల్లో కాట రమేష్, గాజుల ప్రవీణ్ కుమార్, లకన్ పాల్గొన్నారు.

నేడు శాకంబరి పూజలు..

మహంకాళేశ్వర ఆలయంలో బుధవారం శాకంబరీ పూజలు జరగనున్నాయి. 216 ఏళ్ల నుంచి పూజలు అందుకుంటున్న మీరాలంమండి అమ్మవారికి ప్రతి బోనాల ఉత్సవాల సందర్భంగా శాకంబరి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గాజుల అంజయ్య తెలిపారు. అలంకార బ్రహ్మ ఆత్రేయాచార్యతో పాటు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శాకంబరి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరగనున్నాయన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రాధిక

గౌలిపురా: గౌలిపురాలోని మాతేశ్వరి మహంకాళి భరతమాత, కోట మైసమ్మ ఆలయంలో మంగళవారం భీమగాని సురేశ్ గౌడ్, సుజాత కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం ఆలయాన్ని బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కె.రాధిక పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్‌రావు, ముఖ్య సలహాదారులు ఎస్.మల్లేషంగౌడ్, కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గిరి, ఉపాధ్యక్షులు మామిడి కృష్ణ, శ్రీకాంత్, ప్రకాశ్, ప్రకాశ్‌రాజ్, రమేశ్, కోశాధికారి సాయిబాబా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



బోనాల ఊరేగింపులో కరస్పాండెంట్ మిథిలేష్ కుమార్ తదితరులు

జియాగూడ: జియాగూడ ఇంద్రాణి మహా విద్యాలయ్ ద్వారా ప్రతి యేటా సామూహిక బోనాల ఊరేగింపు, మాతేశ్వరీలకు సమర్పణ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని స్కూల్ కరస్పాండెంట్ ఎం.మిథిలేష్‌కుమార్ అన్నారు. మంగళవారం డోర్‌బస్తీలోని స్కూల్ ప్రాంగణం నుంచి సంజయ్‌నగర్ నల్లపోచమ్మ, తుల్జాభవాని మందిరాలకు విద్యార్థులు సామూహిక బోనాలు, పోతరాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఆలయానికి ఊరేగింపుగా చేరుకొని మాతేశ్వరీలకు బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ ఎం.ఇంద్రాణి అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ దివ్యజ్యోతి, ఇన్‌చార్జీలు శ్వేతా, శిరీష, సింధుజ, మీనాక్షి, రిజ్వాన్, ప్రియాంశు, సరిత, మహేశ్వరీ, రాధిక, భాగ్యరేఖ, అనసూయ, రేష్మ, ప్రియా పాల్గొన్నారు.

స్కందా వైస్ చైర్మన్ ఆపరేషన్స్‌గా ఉదయ్ భాస్కర్



ఉదయ్ భాస్కర్‌ను సన్మానిస్తున్న రాజశేఖర్, రాము, అరుణ్ తేజ

గౌలిపురా: పాతబస్తీకి చెందిన సరాబు ఉదయ్ భాస్కర్ స్కందా వైస్ చైర్మన్ ఆపరేషన్స్‌గా ఎన్నికయ్యారు. గ్లోబల్ వైశ్య బిజినెస్ లెజెండ్స్ 3వ వార్షికోత్సవంలో ఉదయ్ భాస్కర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంస్థ చాప్టర్ చైర్మన్‌గా శ్రీకాంత్ శేరి, కోశాధికారిగా హరీష్ కాంకటాలను ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఈ సమావేశంలో నిర్వాహకులు మంచి రాజశేఖర్, కటం రాము, కూన అరుణ్ తేజలు సరాబు ఉదయ్ భాస్కర్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ మంగళవారం ఆయనను కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ..తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు చరిత్రలోనే అత్యంత బలహీన ముఖ్యమంత్రిగా ముద్ర వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

యువతను సన్మార్గంలో నడిపించే నాటకాలు రావాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా రవీంద్రభారతిలో జరుగుతున్న తనికెళ్లభరణి రంగస్థల స్వర్ణోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటుడు నాజర్ మాట్లాడుతూ..తనికెళ్లభరణి ఒక రచయిత, నటుడు, గొప్ప తాత్వికుడు అని కొనియాడారు. ప్రస్తుత సమాజంలో దారిప్పుతున్న యువతను సన్మార్గంలో నడిపించేందుకు మంచి నాటకాలు రావాలని ఆకాంక్షించారు. సినీనటి ఝాన్సీ, రచయిత బుర్ర సాయిమాధవ్, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, సంగమం ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంజయ్ కిషోర్ పాల్గొన్నారు.



అన్నదానం



అబిడ్స్: చెన్నకేశవ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ సమీపాన ట్రస్ట్ సభ్యులు కాజా వెంకట వసంత, కాజా గోపాలకృష్ణ, కాజా గోపాల్‌రావు, సుజాత, పాండు, భారతి, శారద, మాతృనాయక్, అన్నపూర్ణల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రతినెలా మార్కెట్ కోసం వచ్చేవారి కోసం, స్థానిక కార్మికులు, హమాలీల కోసం అన్నదానం చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

బంగారు బోనం సమర్పణ



శాలిబండ: బోనాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అలియాబాద్ దర్బార్ మైసమ్మ ఆలయం ఆధ్వర్యంలో గోల్కొండ జగదాంబ అమ్మవారికి పోతరాజు నృత్యాలు డప్పు చప్పుళ్ల మధ్య బంగారు బోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వై.నరేశ్, టి.చందు, వై.నాగేశ్, విశాల్, టి.నగేశ్ తేజ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా ఉమాప్రకాష్



అబిడ్స్: జీహెచ్ఎంసీ అబిడ్స్-14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా జి.ఉమాప్రకాష్ పదవీబాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలలుగా ఇక్కడ పనిచేసిన దుబ్బాక లావణ్య ఎల్బీనగర్ జోన్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉమాప్రకాష్‌ను 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు.

జీహెచ్ఎంసీ ఉద్యోగులకు స్పెషల్ మెడికల్ క్యాంప్



అఫ్జల్‌గంజ్: జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ కార్మికుల కోసం స్పెషల్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వందలాది మంది కార్మికులకు, ఉద్యోగులకు మెడికల్ క్యాంప్ నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్, ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ..కార్మికుల కోసం జీహెచ్ఎంసీ అండగా ఉంటుందన్నారు. వారు ఆరోగ్యకరంగా ఉండేందుకు తరచు వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

20న జియాగూడ మహంకాళి బోనాలు

జియాగూడ: జియాగూడ మహంకాళి ఆలయంలో ఈ నెల 20న బోనాల వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గొడుగు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం పాతబస్తీ నుంచి తొట్టెల ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుందని, ఆదివారం సామూహిక బోనాల సమర్పణ జియాగూడలోని 58 బస్తీల నుంచి మహిళలు బోనాలు సమర్పిస్తారని తెలిపారు.

అధికారుల ఫిర్యాదుపై దర్యాప్తు ముమ్మరం

అబిడ్స్: జీఎస్టీ వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్లు కె.శ్రీనివాస్, జి.వేణుగోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై అబిడ్స్ పోలీసులు వివరాల సేకరణ ముమ్మరం చేశారు. మంగళవారం అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఏ ఇమాన్యుయేల్ ఇద్దరి అధికారుల ఫిర్యాదును కోర్టుకు పంపినట్లు తెలిపారు. కోర్టు సలహా మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతంగా చేపడుతామని ఆయన వివరించారు. అబిడ్స్ డివిజన్ జీఎస్టీ అడిషనల్ కమిషనర్ జి.లావణ్య తమను పలు విధాలుగా వేధిస్తుందని బషీర్‌బాగ్ జీఎస్టీ సర్కిల్-1, సర్కిల్-2 అసిస్టెంట్ కమిషనర్‌లు కె.శ్రీనివాస్, జి.వేణుగోపాల్ రెడ్డిలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో వాణిజ్యపన్నుల శాఖలో సంచలనంగా మారింది. ఈ ఘటన హాట్ టాపిక్‌గా కొనసాగింది. ఇద్దరు అధికారులు చీఫ్ సెక్రెటరి రామకృష్ణారావు, వాణిజ్యపన్నుల శాఖ మిషనర్ హరితకు కూడా ఫిర్యాదు చేయడంతో వేగంగా ఉన్నతాధికారులు స్పందించారు. అబిడ్స్ డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ అడిషనల్ కమిషనర్‌గా కొనసాగుతున్న లావణ్యను ఉన్నతాధికారులు మంగళవారం బదిలీ చేశారు. ఆమె స్థానంలో దీపారెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అడిషనల్ కమిషనర్ లావణ్యను వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు.

వర్సిటీల్లో ఉద్యోగాలకు నోటిఫికేషన్లను విడుదల చేయాలి



ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నేతలు

నాంపల్లి: రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హరీష్ గౌడ్, టీజీవీపీ వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ చదివే విద్యార్థులకు నెలకు మూడు వేలు, పీజీ విద్యార్థులకు ఐదు వేలు స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. పీహెచ్‌డీ చేస్తున్న పరిశోధక విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఫెలోషిప్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు జాతీయ ఫెలోషిప్‌లు పొందాలంటే నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అనే నిబంధనను తొలగించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి యూజీసీకి లేఖ రాయాలని వారు ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని కోరారు.

ఏరియా ఆసుపత్రులకు ఆదరణ



మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పుష్ప

గోల్కొండ: ఏరియా ఆసుపత్రులకు ఆదరణ రోజు రోజుకు పెరుగుతుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పుష్ప అన్నారు. మంగళవారం ఆమె గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ముందుగా ఆమె ఆసుపత్రిలోని ఔట్‌పేషంట్ విభాగాన్ని సందర్శించి అక్కడ ఉన్న వారితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఇన్‌పేషంట్ వార్డును సందర్శించి అక్కడ ఉన్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రి మెడికల్ సూపరిండెంటెంట్ పి.వి.శ్రీనివాసరావు ఆసుపత్రి వైద్యులతో ఆమె సమావేశమయ్యారు. వైద్యులు క్రమశిక్షణతో పనిచేస్తూ ఏరియా ఆసుపత్రులకు వన్నెతేవాలన్నారు. ఆసుపత్రి కాయాకల్ప్ అవార్డు పొందిందని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు ఆమెకు వివరించారు.

పాతబస్తీలో 100 ఆర్చీలు ఏర్పాటు చేయాలి



గోపిశెట్టి రాఘవేందర్

చార్మినార్: పాతబస్తీలో పండుగ వాతావరణం కనిపించాలంటే విద్యుత్ దీపాలతో కూడిన ఆర్చీ(కమాన్)లను ఏర్పాటు చేయాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ కోరారు. ఈ మేరకు దాదాపు 100 కమాన్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజతో పాటు జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్నను కోరినట్లు ఆయన తెలిపారు. తన వినతి మేరకు ప్రిన్సిపల్ సెక్రటరి సానుకూలంగా స్పందించి జోనల్ కమిషనర్‌కు ఆదేశించారన్నారు. అయినప్పటికీ..ఇప్పటి వరకు ఆ దిశగా స్పందన లేదన్నారు. బోనాల పండుగకు రెండు మూడు రోజులే మిగిలి ఉండడంతో వెంటనే మిగిలిన ఆర్చీలను మంజూరు చేయాలని ఆయన జోనల్ కమిషనర్‌ను కోరారు.

నల్లపోచమ్మ ఆలయంలో రెడ్డి జాగృతి బోనాలు



చాంద్రాయణగుట్ట: మేకలబండలోని నల్ల పోచమ్మ ఆలయంలో రెడ్డి జాగృతి మహిళా అధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి వెండిబోనం సమర్పించారు. లాల్‌దర్వాజాలోని శివపార్వతీ ఫంక్షన్‌హాల్ నుంచి ప్రారంభమై మేకలబండలోని నల్లపోచమ్మ ఆలయం వరకు వందలాది మంది రెడ్డి జాగృతి రాష్ట్ర మహిళలు భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధ్యక్షురాలు గీతారెడ్డి, వ్యవస్థాపకులు పిట్ట శ్రీనివాస్ రెడ్డి, సహ వ్యవస్థాపకులు కొట్టం మధుసూదన్ రెడ్డిను ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్న వెంకటరమణ సన్మానించారు. వీహెచ్‌పీ నాయకులు సామ కృష్ణారెడ్డి, రెడ్డి జాగృతి ఉపాధ్యక్షులు గుజ్జ మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మందడి కరుణాకర్ రెడ్డి, మిద్దె తరుణారెడ్డి, శ్రీవాణి రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో ఎఫ్‌టీసీసీఐ కీలక పాత్ర



హాలును ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నాంపల్లి: రాష్ట్రంలోని పరిశ్రమల అభివృద్ధికి అగ్రగామిగా ఉన్న ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) రెడ్‌హిల్స్‌లోని ప్రధాన కార్యాలయంలో కొత్త సమావేశ మందిరాన్ని ప్రారంభించింది. ఈ హాల్‌కు రామా హాల్ అని పేరు పెట్టారు. ఎఫ్‌టీసీసీఐ సభ్యుడు, దాత రాజేందర్ అగర్వాల్ విరాళంగా అందించిన మొత్తంతో రామా హాల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ హాల్‌ను ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నందున ఎఫ్‌టీసీసీఐకు అభినందనలు తెలియజేశారు. సీనియర్ కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల సీజ్.. తల్లిదండ్రుల ఆందోళన

సుల్తాన్‌బజార్: ఓ ప్రైవేట్ స్కూల్‌ను విద్యాశాఖ అధికారులు సీజ్ చేయడంతో ఆ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. దీంతో మంగళవారం కోఠిలోని శ్రీచైతన్య స్కూల్ ముందు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వందల సంఖ్యల్లో చేరుకొని ఆందోళన చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా పోలీస్ సిబ్బందితో చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఒక్కో విద్యార్థి వద్ద రూ.30 నుంచి రూ.60 వేల వరకు ఫీజులు వసూలు చేశారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ విషయమై సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా, ఎస్ఐ సాయిలు కల్పించుకొని తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించడంతో వారు ఇతర బ్రాంచ్‌లలో ఏర్పాటు చేస్తామని తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో కొంత మంది తల్లిదండ్రులు ఒప్పుకోవడంతో అక్కడ కొంత సమస్య సద్దుమనిగింది.

సౌమ్య రొండేకు సత్కారం



సౌమ్య రొండేను సత్కరిస్తున్న బాలశౌరి, ఆంథోని సాగయరాజ

అబిడ్స్: ప్రపంచ లాంగ్ టెన్నిస్ పోటీలకు భారత్ తరఫున ఎంపికైన కింగ్‌కోఠి సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల క్రీడాకారిణి సౌమ్య రొండేను ఘనంగా సత్కరించారు. ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు జర్మనీలో జరిగే లాంగ్ టెన్నిస్ ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో సెయింట్ జోసెఫ్ కళాశాల సెకండ్ ఇయ్యర్ విద్యార్థినీ సౌమ్య రొండే ఎంపికయ్యారు. జర్మనీకి తరలివెళ్లే ముందు కళాశాల కరస్పాండెంట్ ఎఫ్ఆర్.ఏరువా బాలశౌరి, ప్రిన్సిపాల్ ఎఫ్ఆర్.ఆంథోని సాగయరాజ రూ.లక్ష చెక్కును ఆమెకు అందజేసి అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ కుంభం శ్రీధర్‌రెడ్డి, ప్రొఫెసర్ దీప్లా, డైరెక్టర్ సీత తదితరులు ఆమెను అభినందించారు.